సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



అర్జీలపై ప్రత్యేక దృష్టి

జగనన్నకు చెబుదాం అర్జీలపై ప్రత్యేకంగా దృష్టి సారించి, సత్వరమే పరిష్కరించాలని జేసీ విశ్వనాథన్ ఆదేశించారు. IIలో



మారిటైం సమావేశంపై చర్చ

గోవాలో మారిటైం సమావేశంపై తూర్పు నావికాదళం వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ చర్చలు జరిపారు. IIలో



క్రికెట్ బెట్టింగ్ బుకీల అరెస్ట్

ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న ముగ్గురిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. IIలో

న్యూస్‌రీల్

నేడు 21 ప్రాంతాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష'



మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు మంగళవారం 21 చోట్ల నిర్వహించనున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు సోమవారం 24 ప్రాంతాల్లో నిర్వహించి, 10,753 మంది రోగులకు సేవలు అందించామన్నారు. ఈ శిబిరాల్లో స్త్రీల వైద్యురాలు, పిల్లల వైద్యుడు, జనరల్ ఫిజీషియన్, డెంటల్ వైద్యులు హాజరయ్యారు. రోగులను పరీక్షించి మందులు అందజేశామన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పాత ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కృష్ణ చైతన్య తెలిపారు. పీఎంకేవీవై 4.0లో భాగంగా ప్లంబర్, ఆర్అండ్ ఏసీ, డేటా ఎంట్రీ ఆపరేటర్ వంటి స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. 10వ తరగతి, ఆపై స్థాయి చదువులు చదివి 30 ఏళ్ల వయసులోపు యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల వారు నవంబర్ 5వ తేదీలోపు కంచరపాలెం ప్రభుత్వ ఓల్డ్ ఐటీఐలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 98484 38254లో సంప్రదించాలని సూచించారు.

జాబ్‌మేళా రేపు

ఏయూ క్యాంపస్: ఏయూ మోడల్ కెరీర్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు సంస్థ డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు తెలిపారు. ఎడికో ఇండియా సంస్థలో టెక్నికల్ ఆపరేటర్ ఉద్యోగాలు 200, ఇన్‌స్టలేషన్ ఇంజినీర్ 30, ఇన్‌స్టలేషన్ వైర్‌మేన్ 30, ప్రొడక్షన్ అసిస్టెంట్ అసెంబ్లింగ్ 200 ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. రూ.11 వేలు నుంచి రూ.20 వేల వరకు నెలకు వేతనంగా అందిస్తారన్నారు. సుస్వాదీప్ ఆగ్రో సర్వీసెస్ లిమిటెడ్‌లో కంప్యూటర్ ఆపరేటర్ 2, సేల్స్ ఎగ్జిక్యూటివ్ 10, డెలివరీ ఎగ్జిక్యూటివ్ 30 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. వీరికి రూ.12వేలు నుంచి రూ.16,500 వరకు వేతనంగా అందిస్తారన్నారు. ఆసక్తి గల వారు ncs.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం 96660 92491 నంబరులో సంప్రదించాలన్నారు.

ఉత్తరాంధ్రకు 170 అదనపు బస్సులు

- ప్రమాదం నేపథ్యంలో పలు రైళ్ల రద్దు
- ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- రద్దీగా మారిన బస్ డిపోలు, స్టేషన్లు



ద్వారకా బస్ స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద ప్రయాణికుల రద్దీ

సాక్షి, విశాఖపట్నం : విజయనగరం జిల్లాలో రైళ్ల ప్రమాద నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యామ్నాయ చర్యలకు ఉపక్రమించింది. ప్రమాదం వల్ల విశాఖ నుంచి, విశాఖ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన పలు రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. దీంతో రైళ్లలో వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఆర్టీసీ అదనపు బస్సులను ఏర్పాటు చేసింది. ఇలా సోమవారం అర్ధరాత్రి వరకు విశాఖపట్నం నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి విశాఖకు దాదాపు 170 బస్సులను నడిపింది. విశాఖలోని ద్వారకా బస్ స్టేషన్‌తో పాటు మద్దిలపాలెం, గాజువాక, వాల్తేరు డిపోల నుంచి వీటిని అందుబాటులో ఉంచింది. ఈ బస్సులను పార్వతీపురం, సాలూరు, టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు నడిపింది. సాధారణంగా ఈ ప్రాంతాలకు ప్రతి 15–30 నిమిషాలకో బస్సు సర్వీసు చొప్పున అందుబాటులో ఉంటుంది. రైళ్ల ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు ఆయా ప్రాంతాలకు వెళ్లే వారి కోసం ఈ అదనపు సర్వీసులను నడిపారు. సోమవారం మధ్యాహ్నం వరకు 70 బస్సులను పంపగా, ప్రయాణికుల రద్దీ పెరుగుతుండడంతో మరో వంద బస్సులను సమకూర్చారు. సాలూరు, పార్వతీపురం, శ్రీకాకుళం, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాల నుంచి కూడా విశాఖపట్నం వైపునకు అదనపు బస్సు సర్వీసులను నడిపేలా చర్యలు తీసుకున్నామని ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింతా రవికుమార్ 'సాక్షి'కి చెప్పారు. రైళ్ల దుర్ఘటన అనంతరం ఆదివారం అర్ధరాత్రి దాటే వరకు విశాఖ, విజయనగరంల నుంచి ప్రమాద స్థలికి ఆర్టీసీ బస్సులను పంపించామన్నారు. క్షతగాత్రులతో పాటు ప్రయాణికులను వాటిలో ఆస్పత్రులకు, విశాఖ, విజయనగరాలకు తరలించినట్టు తెలిపారు.

అదనపు బస్సులతో ఊరట

రైళ్ల రద్దుతో తమ గమ్యాలకు చేరుకోవడం ఎలా? అంటూ మదన పడుతున్న ప్రయాణికులు ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ బస్సులతో ఊరట చెందారు. రెగ్యులర్‌తో పాటు అదనపు బస్సులతో ఆయా డిపోలు, బస్‌స్టేషన్లు రద్దీగా మారాయి. బస్సుల్లో సీట్లన్నీ నిండిపోయాయి. పలు బస్సులు నూరు శాతం ఆక్యుపెన్సీతో నడిచాయి. రైళ్ల రద్దయ్యాయన్న బెంగ లేకుండా సమయానికి గమ్యస్థానం చేరుకునేలా ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులను ఏర్పాటు చేయడంపై ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.



ద్వారకా బస్ స్టేషన్‌లో ప్రయాణికుల వెయిటింగ్

బస్సుల్లో ఆక్యుపెన్సీ ఫుల్

మరోవైపు రైళ్ల రద్దుతో వాటిలో ప్రయాణించాల్సిన వారు బస్సులను ఆశ్రయించారు. ఇలాంటి వారి కోసం ఏర్పాటు చేసిన ఆర్టీసీ అదనపు బస్సులతో పాటు రెగ్యులర్ బస్సులు పూర్తి ఆక్యుపెన్సీతో నడిచాయి. చాలా బస్సులు నూరు శాతం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్)తో కిటకిటలాడుతూ రాకపోకలు సాగించాయి. సాధారణంగా హైదరాబాద్, విజయవాడ వైపు వెళ్లే రెగ్యులర్ బస్సుల్లో ఓఆర్ 50–60 శాతానికి మించవు. అలాంటిది సోమవారం ఆ బస్సుల సీట్లు కూడా ఫుల్ అయ్యాయి.

సీఎం జగన్‌కు సాదర స్వాగతం



విమానాశ్రయంలో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మేయర్ హరివెంకటకుమారి, ఎంపీ సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కలెక్టర్ మల్లికార్జున

గోపాలపట్నం : విజయనగరం జిల్లాలో రైలు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను, గాయపడిన వారిని పరామర్శించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక విమానంలో సోమవారం మధ్యాహ్నం 1.19 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడ నుంచి 1.32 గంటలకు హెలికాప్టర్‌లో నేరుగా విజయనగరం వెళ్లారు. విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, సత్యవతి, కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, తహసీల్దార్ జయ తదితరులు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సీఎంవో అదనపు కార్యదర్శి కె.ధనుంజయ రెడ్డి విజయనగరం వెళ్లారు. బాధితులను పరామర్శించి సాయంత్రం 3.38 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు సీఎం జగన్ చేరుకున్నారు. ఇక్కడ నుంచి ప్రత్యేక విమానంలో 3.58 గంటలకు గన్నవరం బయలుదేరారు. ఆయనకు మంత్రులు, అధికారులు వీడ్కోలు పలికారు.

విశాఖలో ఏడుగురికి చికిత్స



రైల్వే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బి.తేజేశ్వరరావు, పి.శ్రీనివాసరావు



కేజీహెచ్ క్యాజువాలిటీలో చికిత్స పొందుతున్న ఎం.వరలక్ష్మి, గొట్ట కమలమ్మ

- కేజీహెచ్‌లో నలుగురు, రైల్వే ఆస్పత్రిలో ఇద్దరు, అపోలో ఆస్పత్రిలో ఒకరు
- రైల్వే ఆస్పత్రిలో చేరిన స్పెషల్ గార్డు మరిపి శ్రీనివాసరావు మృతి

మహారాణిపేట/తాటిచెట్లపాలెం : విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద ఆదివారం రాత్రి రెండు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన మొత్తం ఎనిమిది మందిని విశాఖపట్నం తరలించారు. కేజీహెచ్‌లో నలుగురిని, ఆరిలోవ హెల్త్‌సిటీలోని అపోలో ఆస్పత్రిలో ఒకరిని, రైల్వే హాస్పటల్‌లో ముగ్గురిని చేర్పించారు. వీరిలో పలాస పాసింజర్ స్పెషల్ గార్డు మరిపి శ్రీనివాసరావు(53) ఆదివారం రాత్రే రైల్వే ఆస్పత్రికి తీసుకువచ్చిన కొద్ది సమయంలోనే మరణించారు. ఈయన నగరంలో ఆరిలోవ ప్రాంతంలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. బి.తేజేశ్వరరావు, పి.శ్రీనివాసరావు రైల్వే హాస్పటల్‌లోనే చికిత్స పొందుతున్నారు. కేజీహెచ్‌కు తీసుకొచ్చిన నలుగురిలో విజయనగరం జిల్లా జామి మండలానికి చెందిన నల్ల కుమారి(30), గాజువాక దయాల్ నగర్ ప్రాంతానికి చెందిన ముద్రు లక్ష్మి(40)కి సోమవారం శస్త్ర చికిత్స నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా సింగపురం గ్రామానికి చెందిన మోహిద వరలక్ష్మి45), శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం నడగాం గ్రామానికి చెందిన గొట్ట కమలమ్మ(43) కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. రైలు ప్రమాదంలో గాయపడిన వారికి చికిత్సలు అందించడానికి కేజీహెచ్ నుంచి నలుగురు వైద్యులు విజయనగరం వెళ్లారు. విశాఖ రైల్వే అధికారులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

ఆరిలోవ, తంగేడులో విషాదఛాయలు

ఈ ప్రమాదంలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఇద్దరు మృతి చెందారు. ఆరిలోవ ప్రాంతం బాలాజీనగర్‌లో ఉంటున్న మరిపి శ్రీనివాసరావు(53) పలాస పాసింజర్‌కు స్పెషల్ గార్డుగా ఉండగా.. కోటవురట్ల మండలం తంగేడు గ్రామానికి చెందిన శింగంపల్లి మధుసూదనరావు(53) రాయగడ పాసింజర్ (08504)కు లోకో పైలట్‌గా ఉన్నారు. మధుసూదనరావు ఉద్యోగరీత్యా విశాఖలోని 52వ వార్డు న్యూ కరాసాలో ఉంటున్నారు. ఈయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాసరావుకు వృద్ధాప్యంలో ఉన్న తల్లితో పాటు మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న భార్య అమల, పీజీ చదువుతున్న కుమార్తె హర్షప్రియ, ఏయూలో బీటెక్ చదువుతున్న కుమారుడు చంద్రదీప్ ఉన్నారు. వీరి మృతితో ఇరు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. వారిని వారించడం ఎవరితరం కావడంలేదు. వీరి రోదనలను చూసి స్థానికులు కంటతడిపెట్టారు.

పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: విజయనగరం జిల్లాలో రైళ్ల ప్రమాద ఘటన నేపథ్యంలో ఆయా స్టేషన్ల నుంచి సోమ, మంగళవారాల్లో బయల్దేరాల్సిన సుమారు 47 రైళ్లు రద్దు చేయగా 24 రైళ్లను దారి మళ్లించారు. అలాగే 8 రైళ్ల గమ్యం కుదించగా మరో 8 రైళ్లను రీ షెడ్యూల్ చేశారు. రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ అరుణశ్రీ పర్యవేక్షణలో క్యాన్సిలేషన్, హెల్ప్ లైన్, ఎంక్వయిరీ వద్ద ప్రయాణికులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. రైళ్ల రద్దు సమాచారం ప్రయాణికులకు మెసేజ్‌లు, మీడియా ద్వారా తెలియజేశారు. దీంతో విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల తాకిడి తగ్గింది. కొందరు దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు మాత్రం రైల్వేస్టేషన్‌లోనే ఉండిపోయారు. సోమవారం సాయంత్రం నుంచి పలు రైళ్లను అంచెలంచెలుగా పునరుద్ధరించడంతో ప్రయాణికులకు ఊరట లభించింది. సోమవారం ఉదయం నుంచి రైళ్లు రద్దు కావడంతో రైల్వే స్టేషన్‌లో పలు ప్లాట్‌ఫాంలు ఖాళీగా దర్శనమిచ్చాయి. అయితే విశాఖపట్నం నుంచి విజయవాడ, కేకే లైన్ వైపు రైళ్లు మాత్రం యథావిధిగానే నడిచాయి.

మరికొన్ని రీ షెడ్యూల్, గమ్యం కుదింపు

నేడు రద్దయిన రైళ్లు

విశాఖపట్నం–గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, తిరుపతి–విశాఖపట్నం(08584) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్, కోరాపుట్ – విశాఖపట్నం(18511) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, రాయగడ–విశాఖపట్నం (08503) పాసింజర్ స్పెషల్, విజయనగరం–విశాఖపట్నం(07469) మెము స్పెషల్, తిరుపతి–పూరీ(17480) ఎక్స్‌ప్రెస్, పలాస–విశాఖపట్నం (08531) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం–గుణుపూర్–విశాఖపట్నం(08522/08521), విశాఖపట్నం–రాయగడ(08504) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం–పలాస(08532) పాసింజర్ స్పెషల్, హౌరా–సికింద్రాబాద్(12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, హౌరా–ఎస్ఎంవీ బెంగళూరు(12245) దురంతో ఎక్స్‌ప్రెస్, షాలిమార్–హైదరాబాద్(18045)ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్



ప్లాట్‌ఫాంపై వేచి ఉన్న ప్రయాణికులు

ఒకటో తేదీన రద్దు చేసిన రైళ్లు

రాయగడ–విశాఖపట్నం(08503) పాసింజర్ స్పెషల్, పలాస – విశాఖపట్నం(08531) పాసింజర్ స్పెషల్. అలాగే మంగళవారం ఆయా స్టేషన్లలో బయల్దేరాల్సిన పలు రైళ్లు రీ షెడ్యూల్ చేశారు. అక్కడ బయల్దేరిన సమయాన్ని బట్టి ఆయా స్టేషన్లకు అంతే ఆలస్యంగా చేరుకోనున్నాయి. మంగళవారం భువనేశ్వర్‌లో ఉదయం 05.40 గంటలకు బయల్దేరాల్సిన భువనేశ్వర్–బెంగళూరు(18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ సుమారు నాలుగున్నర గంటలు ఆలస్యంగా ఉదయం 10 గంటలకు బయల్దేరుతుంది.

ఏయూకు గుడ్ న్యూస్

- నేడు ఆచార్యుల నియామకానికి నోటిఫికేషన్
- మొత్తం 523 ఉద్యోగాల భర్తీ
- వైఎస్ హయాం తర్వాత మళ్లీ ఇప్పుడు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సుదీర్ఘకాలం తర్వాత ఆచార్యుల నియామకానికి మార్గం సుగమమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల నియామకాలు చేపడుతోంది. దీనిలో భాగంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఒకే దఫాలో 523 బోధన ఉద్యోగాలు భర్తీ కానున్నాయి. మంగళవారం ఉద్యోగాలు నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కానుంది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రతి విభాగంలో పూర్తిస్థాయిలో ఆచార్యుల నియామకం జరగనుంది. దీంతో విశ్వవిద్యాలయం పూర్తిస్థాయిలో మరింత పటిష్టం అవడానికి మార్గం సుగమం అవుతుంది.

కళాశాలల వారీగా పరిశీలిస్తే ఆర్ట్స్ కళాశాల పరిధిలో ప్రొఫెసర్ 26, అసోసియేట్ 45, అసిస్టెంట్ 86, సైన్స్ కళాశాల పరిధిలో ప్రొఫెసర్ 31, అసోసియేట్ 50, అసిస్టెంట్ 87, న్యాయ కళాశాలలో ప్రొఫెసర్ 4, అసోసియేట్ 7, అసిస్టెంట్ 8, ఫార్మసీ కళాశాలలో ప్రొఫెసర్ 6, అసోసియేట్ 7, అసిస్టెంట్ 17, ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో ప్రొఫెసర్ 18, అసోసియేట్ 30, అసిస్టెంట్ 101 ఉద్యోగాలు భర్తీ కానున్నాయి.

ఆర్ట్స్ కళాశాలలో మొత్తం 157, సైన్స్ కళాశాలలో 168, న్యాయ కళాశాలలో 19, ఫార్మసీ కళాశాలలో 30, ఇంజినీరింగ్ కళాశాలలో 149 ఖాళీలు చొప్పున భర్తీ కానున్నాయి. వర్సిటీలో మొత్తం 523 ఖాళీల భర్తీకి జరగనుంది.

నాడు తండ్రి.. నేడు తనయుడు


మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 2006, 2008లో రెండు పర్యాయాలు ఆచార్యుల పోస్టులను భర్తీ చేశారు. నాటి నుంచి నేటి వరకు విశ్వవిద్యాలయాల్లో బోధన ఉద్యోగాల భర్తీ సాధ్యపడలేదు. అదే సమయంలో విశ్వవిద్యాలయంలో సీనియర్ ఆచార్యుల పదవీ విరమణలు పెరగడంతో అనేక విభాగాల్లో కేవలం ఒకరు ఇద్దరు చొప్పున ఆచార్యులు మాత్రమే మిగిలారు. ఇటువంటి సమయంలో విశ్వవిద్యాలయాలు నిర్వహణ ఎంతో సంక్లిష్టంగా మారింది. వీటన్నింటిని అధ్యయనం చేసి పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల ఉద్యోగాలను భర్తీ చేయాలని నిర్ణయించడంతోపాటు నోటిఫికేషన్ జారీ చేస్తోంది. గతంలో వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో ఆచార్యుల ఉద్యోగాలు భర్తీ కాగా నేడు ఆయన తనయుడు వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి హయాంలో పూర్తిస్థాయిలో ఉద్యోగాల భర్తీ జరుగుతోంది. ఈ దఫా జరుగుతున్న నియామకాల ఫలితంగా విశ్వవిద్యాలయం ఆచార్యులతో పరిపుష్టి అవుతుందని అధికారులు, ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో శతాబ్ది వేడుకలకు సిద్ధమవుతున్న ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఈ ఉద్యోగ నియామక ప్రకటన మరింత బలాన్నిస్తోంది.




జోన్ భద్రతపై విస్తృత సమీక్ష అవసరం

రైల్వే మంత్రికి బీజేపీ ఎంపీ జీవీఎల్ లేఖ

సాక్షి, విశాఖపట్నం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లోని హౌరా–చెన్నై ప్రధాన లైన్‌లో రైళ్ల భద్రతపై విస్తృతమైన సమీక్ష జరపాల్సిన అవసరముందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు సోమవారం లేఖ రాశారు. ఈ జోన్‌లో ఐదు నెలల వ్యవధిలో రెండు పెద్ద రైలు ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు. గత జూన్‌లో ఒడిశాలోని బహనాగ స్టేషన్ సమీపంలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌కు, అదే జోన్‌లో తాజాగా కంటకాపల్లి వద్ద ప్రమాదం జరిగిందన్నారు. ఈ ఘటనలను దృష్ట్యా రైళ్ల భద్రతపై సమగ్ర సమీక్ష జరపాలని కోరారు.





విమానాల వింటర్ షెడ్యూల్ ఖరారు

- రన్‌వే రీ–సర్ఫేసింగ్ నేపథ్యంలో వేళల మార్పు
- నవంబరు 15 నుంచి మార్చి 31 వరకు రాత్రివేళ రన్‌వే మూత
- అందుకనుగుణంగా చర్యలు చేపట్టిన విమానయాన సంస్థలు



రాత్రి వేళ ల్యాండ్ అవుతున్న విమానం

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే విమానాలకు వింటర్ షెడ్యూలు ఖరారైంది. శీతాకాలం సీజన్‌లో ప్రయాణికులతో పాటు పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ సీజనులో విమానయాన సంస్థలు విమాన సర్వీసుల సంఖ్యను పెంచుతూ ఉంటాయి. అయితే నవంబర్ 15 నుంచి మార్చి ఆఖరు వరకు విశాఖ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు రన్‌వేను రీ–సర్ఫేసింగ్ చేయనున్నారు. ఇందుకోసం ఈ నాలుగున్నర నెలలు రాత్రి వేళ రన్‌వేను మూసివేస్తారు. ఆ మర్నాడు ఉదయమే తిరిగి తెరుస్తారు. అందువల్ల ఆ సమయంలో ఎయిర్‌పోర్టులోకి విమానాలను అనుమతించరు. ఈ నేపథ్యంలో విమానాశ్రయంలోకి రాకపోకలు సాగించే విమానయాన సంస్థలకు రీ–సర్ఫేసింగ్ దృష్ట్యా వేళలను సర్దుబాటు చేసుకోవాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఇదివరకే సమాచారం అందించింది. దానికనుగుణంగా ఆయా సంస్థలు షెడ్యూల్‌ను మార్చుకున్నాయి. ఫలితంగా 32 విమాన సర్వీసులు తమ షెడ్యూల్‌ను మార్పులు చేర్పులు చేసుకున్నాయి. ప్రస్తుతం విశాఖపట్నం నుంచి సింగపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసు ఒక్కటే నడుస్తోంది. ఈ విమానం రోజూ రాత్రి 10 గంటలకు విశాఖ వచ్చి 11 గంటలకు బయలుదేరుతుంది. నవంబరు 15 నుంచి ఈ విమానం మూడు గంటలు ముందు అంటే.. రాత్రి ఏడు గంటలకే వచ్చి ఎనిమిది గంటలకు వెళ్తుంది. దీంతో పాటు చెన్నై, ఢిల్లీ, బెంగళూరు, తిరుపతి, కర్నూలు, విజయవాడ, హైదరాబాద్, కడప, కోల్‌కతా, గోవా, జైపూర్, పోర్టుబ్లెయిర్, పూణే నుంచి వచ్చి, వెళ్లే దేశీయ విమాన సర్వీసులు కూడా తమ షెడ్యూల్ సమయాన్ని అరగంట నుంచి మూడు గంటల వరకు సర్దుబాటు చేసుకున్నాయి. కాగా రన్‌వే రీ–సర్ఫేసింగ్‌తో ఈ వింటర్ సీజనులో విమాన సర్వీసులు పెరగకపోగా కొన్ని తగ్గనున్నాయి.

మా సమస్యలు పరిష్కరించరూ..

'జగనన్నకు చెబుదాం'లో అర్జీదారుల వినతి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న నగర మేయర్ హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: సార్..ఇప్పటి వరకు నాలుగు సార్లు గ్రీవెన్స్‌లో బిల్డింగ్ డీవీయేషన్‌పై దరఖాస్తు పెట్టుకున్నా. ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదు అంటూ అనకాపల్లి జోన్ నుంచి ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. సచివాలయానికి వెళ్లి సమస్య చెప్పుకుంటే పరిష్కారం కాలేదు. జోనల్ కార్యాలయానికి వెళ్లినా అదే పరిస్థితి..చివరకు మీ వద్దకు వచ్చా. మీరే నా సమస్య పరిష్కరించాలి అంటూ మరొకరు సోమవారం జీవీఎంసీలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మేయర్ హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతి పత్రం సమర్పించారు. అలాగే ప్రాపర్టీ ట్యాక్స్‌కు సంబంధించి, పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి అర్జీలను స్వీకరించారు. జగనన్నకు చెబుదాం (గ్రీవెన్స్) కార్యక్రమంలో మొత్తం 86 వినతులు వచ్చాయి. వీటిలో జోన్-1 నుంచి ఒకటి, జోన్-2కు 9, జోన్-3కు 14, జోన్-4కు 7, జోన్-5కు 13, జోన్-6కు 14, జోన్-7కు ఒకటి, జోన్-8కు 8 ఫిర్యాదులు రాగా ప్రధాన కార్యాలయానికి సంబంధించి 19, యూసీడీకి 3, హార్టీకల్చర్ విభాగానికి 3 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులను మూడు రోజుల్లో పరిష్కరించాలని కమిషనర్ సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజనీరు రవికృష్ణరాజు, సీసీపీ సురేష్, సీఎంవోహెచ్ డాక్టర్ నరేష్‌కుమార్, ఎగ్జామినర ఆఫ్ అకౌంట్స్ వాసుదేవ రావు, కార్యదర్శి పి.నల్లనయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 68 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏడీసీపీ

దొండపర్తి: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే చట్టప్రకారం పరిష్కరించాలని ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 68 ఫిర్యాదులు వచ్చాయి. ఏడీసీపీ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని చెప్పారు.

ముగ్గురు క్రికెట్ బెట్టింగ్ బుకీల అరెస్ట్



బెట్టింగ్‌కు ఉపయోగించే లైన్‌బాక్సులు, ఫోన్లు

మద్దిపాలెం: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న వారిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ - 1 కె.శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. బిర్లా జంక్షన్ వద్ద ఓ ఇంట్లో ఆన్‌లైన్‌లో వరల్డ్ కప్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిపై ఆదివారం రాత్రి సైబర్ క్రైం పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారు నెల్లూరుకు చెందిన విశ్వనాథ రెడ్డి, ఎస్‌కే చాందని భాషా, విజయనగరానికి చెందిన లండా రామకృష్ణగా గుర్తించారు. ప్రధాన నిందితుడు విశ్వనాథరెడ్డిపై గతంలో కేసులున్నాయి. క్రికెట్ ఎక్స్ఛేంజ్, క్రికెట్ లైన్ వంటి యాప్‌లను ఆసక్తి గల వారిని డౌన్‌లోడ్ చేసుకోమని విశ్వనాథరెడ్డి బుకీగా వుంటూ బెంగుళూరులోని ప్రధాన బుకీ గణష్ ఆధ్వర్యంలో బెట్టింగ్‌లు నిర్వహిస్తుంటాడు. మిగతా ఇద్దరూ ఇతని వద్ద సహాయకులుగా పనిచేస్తుంటారు. యువతను టార్గెట్ చేస్తూ కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న ఈ ముఠాను సైబర్ క్రైమ్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి 29 ఫోన్లు, 2 ల్యాప్‌టాప్‌లు, 2 లైన్‌బాక్సులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ భవానీ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రియుడి మోజులో మాతృత్వం మరచి...

- నిద్రిస్తున్న కొడుకును సంప్‌లో తోసేసి కడతేర్చిన తల్లి
- బాలుడి మృతి కేసు వివరాలు వెల్లడించిన పోలీసులు



వేదాంత్‌తో మణి (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: ప్రియుడి మోజులో మాతృత్వాన్ని మరిచిపోయి కర్కశంగా కన్నబిడ్డనే కడతేర్చిన తల్లిని పోలీసులు హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. గాజువాక పంతులుగారి మేడ సమీపంలోని ఓ గ్రూప్ హౌస్ సంప్‌లో ఇటీవల బాలుడు శవమై తేలిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి నిందితురాలిని అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు సోమవారం వెల్లడించారు. దూది దొరబాబు, మణికి శంకర్, వేదాంత్ (5) పిల్లలు. దొరబాబు పంతులు గారి మేడ వద్ద ఒక గ్రూప్ హౌస్ వాచ్‌మన్‌గా ఉంటూ అక్కడే రూమ్‌లో ఉంటున్నారు. ఈ క్రమంలో మణికి కొద్ది నెలల కిందట హైదరాబాద్ ఉప్పల్‌లో నివసిస్తున్న కాకినాడకు చెందిన పనస కుమార్‌తో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. సదరు పనస కుమార్ గంజాయి తరలింపు కేసుల్లో నిందితుడు కూడా. ఆ కేసుల నిమిత్తం విశాఖ నగరంలోని కోర్టుకు తిరుగుతున్న సమయంలో మణితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో మణిని వివాహం చేసుకుంటానని కుమార్ నమ్మించాడు. అప్పటికే పలు మార్లు భర్తతో గొడవ పడిన మణి అందుకు అంగీకరించింది. అయితే పెళ్లి చేసుకోవాలంటే పిల్లలు ఉండకూడదని కుమార్ షరతు పెట్టడంతో మణి ఘాతుకానికి పాల్పడింది. ఈ 28న ప్రియుడితో వెళ్లిపోయేందుకు సిద్ధమైన మణి... తనతో చేరిక ఎక్కువ ఉన్న చిన్న కుమారుడు వేదాంత్ నిద్ర మత్తులో వుండగా నీటి సంప్ మూత తీసి అందులో పడేసి వెనుక గేటు నుంచి వెళ్లిపోయింది. అనంతరం మూడు రోజుల తర్వాత సంప్ నుంచి దుర్వాసన రావడంతో తెరిచి చూడగా బాలుడి మృతదేహం కనిపించడంతో తండ్రి దొరబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవి శంకర్, సౌత్ ఏసీపీ త్రినాథ్ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టి మణిని, ఆమె ప్రియుడు పనస కుమార్‌ను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వారిని నగరానికి తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించారు.

'జగనన్నకు చెబుదాం' అర్జీలపై ప్రత్యేక దృష్టి

మహారాణిపేట: జగనన్నకు చెబుదాం అర్జీలపై ప్రత్యేకంగా దృష్టి సారించి, సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జేసీ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మొత్తం 216 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 106, జీవీఎంసికి సంబంధించి 32, పోలీసు శాఖకు సంబంధించి 15, ఇతర శాఖలకు సంబంధించి 63 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో కె.మోహన్ కుమార్, ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్, పోలీసు, మున్సిపల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో నిందితులకు రిమాండ్



ఆటో డ్రైవర్ నీలాద్రిని సత్కరిస్తున్న సీపీ రవి శంకర్

బీచ్‌రోడ్డు/అల్లిపురం: బీచ్‌రోడ్డులో కిడ్నాప్‌నకు గురైన బాలుడ్ని ఆటో డ్రైవర్ రక్షించి పోలీసులకు అప్పగించాడు. మూడో పట్టణ సీఐ కొరాడ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. యాచక వృత్తి చేసుకుంటూ రోడ్డుపై 10 నెలల చిన్నారితో పడుకున్న కుటుంబాన్ని నిందితులు గమనించి.. ఆ బాలుడ్ని కిడ్నాప్ చేయాలని ప్లాన్ చేశారు. శనివారం రాత్రి బాలుడ్ని కిడ్నాప్ చేశారు. నిందితులు ఆర్కేబీచ్ నుంచి కోస్టల్ బ్యాటరీ వైపు వెళ్తున్న సమయంలో బాలుడు ఏడవడంతో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ నీలాద్రి గమనించాడు. వారిని నిలదీయడంతో నిందితులు బాలుడ్ని విడిచిపెట్టి పరారయ్యారు. ఆటో డ్రైవర్ బాలుడ్ని మహారాణిపేట పోలీసులకు అప్పగించాడు. ఆదివారం ఆ బాలుడ్ని తీసుకుని ఆర్కేబీచ్‌లో విచారించి తల్లిదండ్రులకు అప్పగించారు. సీసీ కెమెరాల ఆధారంగా విజయవాడకు చెందిన ఫకీర్, ప్రసాద్ రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు వారికి 11 రోజులు రిమాండ్ విధించింది. మరో నిందితుడు హరిబాబు కోసం పోలీసులు గాలిస్తున్నారు. బాలుడ్ని కిడ్నాపర్ల చెర నుంచి కాపాడిన ఆటో డ్రైవర్ నీలాద్రిని పోలీసు కమిషనర్ రవిశంకర్ అభినందించి నగదు రివార్డు అందజేశారు.

'ఉపేంద్ర గాడి అడ్డా' ట్రైలర్ లాంచ్



చిత్ర యూనిట్‌తో నటుడు బ్రహ్మానందం

అల్లిపురం: ఎస్ఎస్ఎల్ క్రియేషన్స్ పతాకంపై నిర్మాత కంచర్ల అచ్యుతరావు స్వీయ సమర్పణలో నిర్మించిన ఉపేంద్ర గాడి అడ్డా సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం సోమవారం నగరంలో దసపల్లా హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాస్య బ్రహ్మ బ్రహ్మానందం హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన అభిమాన నిర్మాత అచ్యుతరావు నిర్మించిన సినిమా టీజర్ విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. ఒక్క సినిమా తీయడమే కష్టంగా ఉన్న ఈ తరుణంలో ఒకేసారి ఆరు సినిమాలు నిర్మించడం గొప్ప విషయమన్నారు. ఆరో సినిమా 1920 భీమునిపట్నం అని బ్రహ్మానందం ప్రకటించారు. కంచర్ల అచ్యుతరావు కుమారుడు ఉపేంద్ర హీరోగా నటించిన ఈ చిత్రం పాటలు, టీజర్‌కి ఇప్పటికే మంచి స్పందన వచ్చిందని దర్శకుడు ఎస్‌కే ఆర్యన్ శుభాన్ తెలిపారు. ఎస్ఎస్ఎల్ క్రియేషన్స్ బ్యానర్‌పై ఒకేసారి నిర్మిస్తున్న ఆరు చిత్రాల టీజర్లు ఈ సందర్భంగా ప్రదర్శించామన్నారు. నిర్మాత కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ ఎస్ఎస్ఎల్‌వీ క్రియేషన్స్ పతాకంపై ఐదు సినిమాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఆరో సినిమా పోస్టర్ లాంచ్ కూడా త్వరలో ఏరాపటు చేస్తామని తెలిపారు. కంచర్ల ఉపేంద్రతో బీ ఫార్మసీ, ఐపీసీ 369, అనగనగా కథలా, ఉపేంద్ర గాడి అడ్డా సినిమాలు నిర్మించామని తెలిపారు. 2001లో సాయిరామ్ సేవా ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దర్శకుడు యాదకుమార్ చెప్పిన కథ నచ్చడంతో తొలిసినిమా కంచర్ల ప్రారంభించామన్నారు.

జాతీయ స్థాయి బాక్సింగ్‌లో రఘుదర్శన్ ప్రతిభ



సిల్వర్ మెడల్ సాధించిన రఘుదర్శన్

సీతంపేట: బాక్సింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీడీఎఫ్ఐ) ఈ నెల 27 నుంచి 29 వరకు ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి సీహెచ్.రఘుదర్శన్ సిల్వర్ మెడల్ సాధించాడు. గత ఏడాది కూడా ఈపోటీలలో సిల్వర్ మెడల్ సాధించాడు త్వరలో జరగబోయే పోటీల్లో బంగారు పతకం సాధిస్తానని రఘుదర్శన్ ఆశాభావం వ్యక్తం చేశాడు. స్థానిక కోచ్ అమ్మోరు వద్ద బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్నాడు. రఘుదర్శన్‌ను కళాశాల కరస్పాండెంట్ జి. మధుకుమార్, ప్రిన్సిపాల్ జీఎస్‌కే చక్రవర్తి, ఫిజికల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు అభినందించారు.

41మంది అధ్యాపకులకు తాఖీదులు

అనకాపల్లి రూరల్ : గత మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనంలో పొరపాట్లు చేసిన పలువురు జూనియర్ లెక్చరర్లకు ఇంటర్ బోర్డు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చెందిన 41మందికి ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు,యాజమాన్యాల ద్వారా తాఖీదులు పంపినట్లు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రాయల సత్యనారాయణ తెలిపారు. మూల్యాంకనం సమయంలో వారు ఏఏ తప్పులు చేశారో నోటీసుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న వారిలో ఎక్కువ మంది శ్రీచైతన్య, నారాయణ కాళాశాలలకు చెందిన వారే ఉండడం గమనార్హం. వారం రోజుల్లోగా షోకాజ్ నోటీసులకు వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో సంబంధిత అధ్యాపకులకు జరిమానా విధించడంతో పాటు ఏపీ పబ్లిక్ పరీక్షల చట్టం సెక్షన్ 10 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్టు నోటీసుల్లో తెలిపారు.



సీఎంఆర్ షాపింగ్ మాల్ అధినేత మావూరి వెంకట రమణ కుమార్తె వెడ్డింగ్ రిసెప్షన్ సోమవారం రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగింది. మావూరి వెంకటరమణ కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.
-మహారాణిపేట

స్టీల్‌ప్లాంట్ డీపీఎస్‌లో చైల్డ్ రైట్స్ ఉల్లంఘన



ఫిర్యాదులపై విచారణ జరుపుతున్న చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యుడు సీతారాం

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్)లో చైల్డ్ రైట్స్ ఉల్లంఘన జరుగుతోందని, ఈ అంశం తమకు వచ్చిన ఫిర్యాదులను విచారించిన తర్వాత స్పష్టమైందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. సోమవారం ఆయన డీపీఎస్‌లో అమలవుతున్న బాలల హక్కుల పరిరక్షణ, విధి విధానాలపై ఆరా తీశారు. పాఠశాలపై కమిషన్‌కు అందిన ఫిర్యాదులపై క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి సీతారాం ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులు రెండు నుంచి ఐదు నిమిషాలు ఆలస్యమైనా తిరిగి వారిని ఇంటికి పంపించేస్తున్నట్టు విద్యార్థులు తమ దృష్టికి తెచ్చారన్నారు. అలాగే ఫీజులు చెల్లించడంలో కొద్దిపాటి ఆలస్యం జరిగిందన్న కారణంతో అపరాధ రుసుంతో పాటు విద్యార్థులను ఎండలో నిలబెట్టడంపై ఫిర్యాదులు అందాయన్నారు. జాతీయ పండుగలు, రెండో శనివారం సెలవు అమలు జరగకపోవడం, ప్రభుత్వం నిర్దేశించిన దసరా, సంక్రాంతి, వేసవి సెలవులు ఇవ్వకుండా యాజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందన్నారు. సైకాలజిస్టు లేరని సైకాలజీ తరగతులు నిర్వహించకపోవడం, ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులను ఇష్టానుసారం ఉద్యోగాల నుంచి తొలగించి నచ్చిన వారికి తక్కువ జీతాలకు నియమించడంపై ఫిర్యాదులు అందాయన్నారు. వీటిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని, క్రమశిక్షణా చర్యలకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతామన్నారు. గాజువాక ఎంఈవో విశ్వనాథ్, ఎంఈవో-2 సునీత, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నీలవేణి, పీఓఐసీ మమత, స్టీల్‌ప్లాంట్ సీఐ వి. శ్రీనివాసరావుతో పాటు తల్లిదండ్రుల అసోసియేషన్ ప్రతినిధులు ఫణికుమార్, సత్యనారాయణ, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రాజశేఖర్‌కు మాతృ వియోగం



సత్యవతి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఇంటక్ ప్రధాన కార్య దర్శి, రాష్ట్ర వైఎ స్సార్ సీపీ నాయకుడు మంత్రి రాజశేఖర్ మాతృమూర్తి మంత్రి సత్యవతి (84)సోమవారం కన్నుమూశారు. ఆమె పార్థివదేహాన్ని నడుపూరులో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకటరామయ్య, పల్లా శ్రీనివాసరావు సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గోవాలో మారిటైం సమావేశంపై చర్చ

సింధియా: గోవాలో మారిటైం సమావేశంపై తూర్పు నావికాదళం వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, రిప్లబిక్ ఆఫ్ సింగపూర్ హెడ్ నావల్ ఆపరేషన్స్ రియర్ అడ్మిరల్ సాహి టాట్‌తో కలిసి ద్వైపాక్షిక చర్చలు జరిపారు. భవిష్యత్తు కార్యాచరణ, జలాంతర్గామి రెస్క్యూతో పాటు ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక, బహుపాక్షిక సంబంధాలను మెరుగుపై చర్చించారు.